ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో నిర్భయంగా ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రికకు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను. బిచ్కుంద. తాడ్వాయి. లింగంపేట, నస్రుల్లాబాద్, మహమ్మద్‌నగర్, సదాశివనగర్ మండలాలకు రిపోర్టర్‌లు కావలెను.

ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.

96665 56646

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నిజామాబాద్ కామారెడ్డి



## అంబరాన్నంటిన హోలీ

# సంబరాలు

### -యువత డీజే నృత్యాలతో సందడి
### - రంగుల జల్లులో మునిగిన ప్రజలు



**పెద్ద కొడప్‌గల్, మార్చి 03: (ప్రజాజ్యోతి)** వసంత ఋతువుకు స్వాగతం పలుకుతూ చెడుపై మంచి విజయం సాధించిన సందర్భంగా జరుపుకునే హోలీ పండుగను పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో సంబరాలు అంబరాన్నంటాయి. సాంప్రదాయంగా హోలీ పండుగను ఐక్యత, స్నేహభావానికి ప్రతీకగా భావిస్తారు. పరస్పర భేదాభిప్రాయాలను మరచి రంగులు చల్లుకుంటూ -మిగతా 2లో..

## జిల్లా పోలీస్ కార్యాలయంలో

# హోలీ వేడుకలు

### అధికారులు, సిబ్బందితో కలిసి ఆనందాన్ని పంచుకున్న ఎస్పీ యం.రాజేష్ చంద్ర



**కామారెడ్డి ప్రతినిధి మార్చి 03. (ప్రజాజ్యోతి)** జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో హోలీ పండుగ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని, ఒకరికొకరు రంగులు పూసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. -మిగతా 2లో..

# ముదురుతున్న ఎండలు

**నిజామాబాద్ మార్చి 3(ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో వాతావరణం క్రమేపీ వేడెక్కుతోంది. మార్చి మొదటి వారంలోనే మాడు పగిలే ఎండలు కాస్తున్నాయి. గడచిన నాలుగైదు రోజులుగా వాయవ్య, మధ్య భారతంలో ఒక్కసారిగా ఎండలు పెరిగాయి. దీనికితోడు మధ్య భారతంలో కొనసాగుతున్న అధికపీడనం ప్రభావంతో వాయవ్య భారతం నుంచి వేడి గాలులు రాష్ట్రంపైకి వీస్తున్నాయి. దీంతో గడచిన నాలుగు రోజులుగా దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు





# అంబరాన్నంటిన హోలీ సంబరాలు





ఆనందాన్ని పంచుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. ఉదయం వేళల నుంచే మండల కేంద్రం మొత్తం రంగుల హరివిల్లులా మారిపోయింది. ప్రధాన వీధులు, కాలనీలు గులాల్లతో కళకళలాడగా, పిల్లలు పిచికారీలతో నీటి రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. యువత గుంపులుగా చేరి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు.
మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద డీజే సంగీతం మారుమోగింది. తాజా సినీ గీతాలకు యువత డ్యాన్స్‌లు చేస్తూ పండుగ ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. జానపద గీతాలు, ఆధునిక నృత్యాలు, వినోద ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కొంతమంది యువకులు సంప్రదాయ వేషధారణలో నృత్యాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
ఈ కార్యక్రమంలో మాజీ జుక్కల్ శాసనసభ్యుడు సౌదాగర్ గంగారం, బస్వరాజ్ దేశాయ్, సుధాకర్ సెట్, ప్రేమ్ సింగ్, భగత్, శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై సంబరాలను విజయవంతం చేశారు. మొత్తానికి పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో హోలీ పండుగ సంబరాలు ఐక్యత, స్నేహభావానికి ప్రతీకగా నిలిచాయి. రంగుల సందడితో మండల కేంద్రం పండుగ శోభతో మెరిసిపోయింది.

## ధూమ్ ధామ్‌గా హోలీ వేడుకలు

- రంగుల మయంగా బిక్కనూరు
- సాంప్రదాయ రంగులతో హోలీ వేడుకలు
- రంగులతో తడిసి ముద్దయిన గ్రామాలు
- మతసామరస్యానికి ప్రత్యేకగా హోలీ సంబరాలు





**కామారెడ్డి (ఆర్ సి) మార్చ్ 3 బిక్కనూరు (ప్రజా జ్యోతి)**
బిక్కనూరు లో హోలీ వేడుకలు అంబరాన్ని అంటాయి. చిన్నా, పెద్ద అంతా హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోనే కాకుండా గ్రామాల్లోనూ హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో సంపూర్ణ చంద్రగ్రహణం ఉన్నప్పటికీ, మధ్యాహ్నం ఒకటి గంటల వరకు హోలీ వేడుకలను జరుపుకొని ముగించారు. తదనంతరం చంద్రగ్రహణ నియమాలను పాటించారు

# సిరికొండలో రంగుల హోలీ సంబరాలు

**కాముడి దహనంతో ఆరంభం... యువత కేరింతలతో సందడి**
**రంగుల ఆటలో పాత్రికేయుల బృందం**



**నిజామాబాద్ రూరల్:మార్చి, 4 (ప్రజా జ్యోతి)**
సిరికొండ మండలంలోని పలు గ్రామాల్లో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి సంప్రదాయబద్ధంగా కాముడి దహనం నిర్వహించి చెడు మీద మంచి విజయం సాధించినట్లు సూచిస్తూ వేడుకలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో భక్తి, ఉత్సాహ వాతావరణం నెలకొంది.
మంగళవారం ఉదయం నుంచే యువత, చిన్నారులు రంగులతో ఒకరిపై ఒకరు చల్లి ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. ఈసారి చంద్రగ్రహణం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉండనున్న నేపథ్యంలో గ్రామస్తులు ముందుగానే ఏర్పాట్లు చేసుకుని మధ్యాహ్నం 2 గంటల వరకు రంగుల ఆటలు ఆడి సంబరాలు జరుపుకున్నారు. డీజే మ్యూజిక్‌కు యువత కేరింతలు కొడుతూ హోలీ సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు.
గ్రామాల్లో పెద్దలు, మహిళలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. చిన్నారులు రంగులలో తడిసి ముద్దై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.
ఈ హోలీ సంబరాల్లో సిరికొండ మండల పాత్రికేయుల బృందం ఆర్ సి రెడ్డి, రాజేశ్వర్, రాజన్న, లింగం, సంతోష్ రెడ్డి, మహేష్, ప్రకాష్, తిరుపతి, రమేష్, నరేందర్ కూడా పాల్గొని ప్రజలతో కలిసి రంగులు చల్లి ఆనందాన్ని పంచుకున్నారు. పరస్పర స్నేహభావం, ఐక్యతను ప్రతిబింబిస్తూ హోలీ వేడుకలు మండలవ్యాప్తంగా హర్షోల్లాసాలతో కొనసాగాయి.
రంగుల హోలీ గ్రామీణ ప్రాంతాల్లో ఆనందాన్ని నింపగా, ఎక్కడ చూసినా ఉత్సాహ వాతావరణం నెలకొంది.



## ముదురుతున్న ఎండలు

రాయలసీమలో నమోదయ్యాయి. ఇదిలావుండగా దక్షిణ తమిళనాడు దానికి ఆనుకుని గల్ఫ్ ఆఫ్ మన్నార్ పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం దిశగా పొడిగాలులు వీచే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రంలో ఎండలు మరింతగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల ఐదో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువగా నమోదవుతాయి. ఒకటి, రెండు చోట్ల 39, 40 డిగ్రీలు అంతకంటే ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణులు పేర్కొన్నారు.


## జిల్లా పోలీస్ కార్యాలయంలో హోలీ వేడుకలు



నిరంతరం విధి నిర్వహణలో బిజీగా ఉండే సిబ్బందిలో నూతనోత్సాహాన్ని నింపేలా ఎస్పీ స్వయంగా వారితో కలిసి ఆనందాన్ని పంచుకోవడం ఈ వేడుకల్లో విశేషం. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ, పోలీస్ అధికారులకు మరియు సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంగుల పండుగ హోలీ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఐక్యత మరియు కొత్త వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. వృత్తిరీత్యా ఎంతో ఒత్తిడితో కూడిన విధులను నిర్వహించే పోలీసు కుటుంబంలో ఇటువంటి వేడుకలు సభ్యుల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను మరింత పటిష్టం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.
ఈ వేడుకల్లో జిల్లా అదనపు ఎస్పీ కె. నరసింహ రెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, పిసిఆర్ సిఐ నరేష్, కామారెడ్డి టౌన్ ఎస్.హెచ్.ఓ నరహరి, సదాశివ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సంతోష్ కుమార్, ఎల్లారెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, ఆర్.ఐ లు నవీన్ కుమార్, కృష్ణ మరియు జిల్లాలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను ఘనంగా జరుపుకున్నారు.

## కానిస్టేబుల్ తో గొడవకు దిగిన పలువురు అరెస్ట్

**ఇందల్వాయి,( ప్రజా జ్యోతి న్యూస్ ) ఫిబ్రవరి. 3**
ఇందల్వాయి మండల పరిధిలోని పహారా విధుల్లో ఉన్న ఇందల్వాయి పీఎస్ పి.సి శ్రీ పోతుల ప్రతాప్ మరియు హెచ్‌జి తిరుపతి తెల్లవారుజామున 00:౫50 గంటలకు మెగ్యానాయక్ తండాలో గొడవ జరుగుతున్నట్లు డయల్-100 సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకొని పరిశీలించగా లకావత్ నరేష లకావత్ బంతిలాల్ దేగావత్ పీర్ సింగ్ మద్యం మత్తులో గొడవ పడుతూ అల్లర్లు సృష్టిస్తున్నట్లు గుర్తించారు. వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించగా పోలీసులను దూషిస్తూ విధి నిర్వహణకు అడ్డంకి కలిగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు



# తెలంగాణ జాగృతిలో పలువురి చేరిక

### -కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షుడు సంపత్ గౌడ్

**నాగిరెడ్డిపేట్,మార్చి3(ప్రజాజ్యోతి):** నాగిరెడ్డిపేట్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు,యువకులు మంగళవారం తెలంగాణ జాగృతిలో భారీగా చేరారు.వారికీ జిల్లా అధ్యక్షుడు సంపత్ గౌడ్ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు.అనంతరం మండల కేంద్రంలోని రామాలయంలో జాగృతి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడి సమక్షంలో మండల కమిటీతో,పాటు వివిధ గ్రామాల కమిటీలను ఎన్నుకున్నట్లు తెలంగాణ జాగృతి నాగిరెడ్డిపేట్ మండల అధ్యక్షడు సుభాన్ రెడ్డి తెలిపారు.నాగిరెడ్డిపేట్ మండల యూత్ ప్రెసిడెంట్ గా ఎండి ఫయీమ్,వైస్ ప్రెసిడెంట్ గా మన్నే విష్ణు,మెల్లకుంట తాండ గ్రామా అధ్యక్షుడిగా విజయ్ కుమార్,మాల్తుమ్మెద గ్రామా అధ్యక్షడిగా బలరాం,ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్,మాల్తుమ్మెద యూత్ అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్,ఉపాధ్యక్షులుగా ప్రశాంత్ యూత్ ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్ ను, చినుర్ గ్రామా అధ్యక్షుడిగా బాతుల ప్రవీణ్,ఉపాధ్యక్షుడిగా దాసరి విష్ణు,కార్యదర్శిగా బాతుల నిఖిల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ జాగృతిలో చేరిన నాయకులు జాగృతి బలోపేతం కొరకు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు



కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు సంపత్ గౌడ్,నాగిరెడ్డిపేట్ మండల అధ్యక్షుడు సుభాన్ రెడ్డి,సీనియర్ నాయకులు బాగా రెడ్డి,మైనార్టీ అధ్యక్షుడు జాకీర్, గోపాల్పేట్ గ్రామా అధ్యక్షుడు సిద్ధిరాములు,మైనార్టీ అధ్యక్షుడు ఎజాస్,మండల మహిళా అధ్యక్షురాలు మేకల పద్మ,జనరల్ సెక్రెటరీ ఖలీల్,జాగృతి నాయకులు మల్లారెడ్డి, సుదర్శన్,మన్మోహన్ రెడ్డి,సలహాదారులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులకు శ్రీకారం



**రాజంపేట మార్చి 3 (ప్రజా జ్యోతి)** పెద్దాయిపల్లి గ్రామంలో మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ఘనంగా ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి మరియు ఉపాధి కల్పన లక్ష్యంగా ఈ పనులకు గ్రామ సర్పంచ్ కామి షెట్టి నరేష్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సౌందర్య మహేష్, రమేష్, గ్రామ కార్యదర్శి సోనీ, పాలకవర్గ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రహదారులు, కాలువలు తదితర మౌలిక వసతులు అభివృద్ధి చెందుతాయని సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పాలకవర్గం వెల్లడించింది.

# గాంధారిలో ఘనంగా వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవం







**గాంధారి, మార్చి 3 (ప్రజాజ్యోతి)** గాంధారి మండలంలోని పోతంగల్, గుడి వెనుక తాండ లో మంగళవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సునీత తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, యువకులు , స్థానిక సర్పంచ్లు, అటవీ సిబ్బంది పెద్ద సంఖ్య లో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ సంపద, వన్య ప్రాణులు ప్రకృతి సమతుల్యతకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. వన్య ప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అడవుల్లో అక్రమ వేట, చెట్ల నరికివేత వంటి చర్యలు పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు. వన్యప్రాణుల జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.గ్రామంలో పర్యావరణంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించడంతో పాటు, సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. గ్రామస్తులు అడవులను కాపాడేందుకు సహకరించాలనీ, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రవి,అటవీ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత పాల్గొని వన్య ప్రాణి సంరక్షణకు తమ మద్దతు తెలిపారు.

# 24 సీసీ కెమెరాలు మరమ్మతులు - భద్రతకు బలం



**రాజంపేట మార్చి 3 (ప్రజా జ్యోతి)** అరగొండ గ్రామంలో గ్రామ ప్రజల సహకారంతో 24 సీసీ కెమెరాలను మరమ్మతు చేసి మళ్లీ వినియోగంలోకి తీసుకువచ్చినట్లు గ్రామ సర్పంచ్ ఎర్ర విక్రాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొంతకాలంగా పనికిరాని స్థితిలో ఉండటంతో భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత పాలకవర్గం ఈ సమస్యపై దృష్టి సారించకపోవడంతో కెమెరాలు నిర్వీర్యంగా మారాయని తెలిపారు. తాజాగా ఎన్నికైన సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రజల అభ్యర్థన మేరకు వెంటనే చర్యలు తీసుకుని కెమెరాలను మరమ్మతు చేయించి గ్రామ భద్రతను పటిష్టం చేసినట్లు వివరించారు. సీసీ కెమెరాల పునరుద్ధరణతో గ్రామంలో చోరీలు, అల్లర్లు వంటి ఘటనలను అరికట్టడంలో సహాయపడుతుందని, రాత్రివేళ భద్రత మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఏవైనా అనుచిత ఘటనలు చోటుచేసుకున్నప్పుడు వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రామాభివృద్ధి మరియు భద్రత కోసం ప్రజల సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ ఎర్ర విక్రాంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# నేడు రాజంపేటలో ఎమ్మెల్యే పర్యటన

### పలు అభివృద్ధి కార్యక్రమాలు



**రాజంపేట మార్చి 3 (ప్రజా జ్యోతి)** కాటిపల్లి వెంకట రమణ రెడ్డి నేడు రాజంపేట మండల పరిధిలో నిర్వహించిన పలు అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలకు హాజరయ్యారు. మధ్యాహ్నం 12:30 గంటలకు తలమడ్ల గ్రామానికి సంబంధించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్నం 01:30 గంటలకు రాజంపేట రైతు వేదికలో రాజంపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి / షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తదుపరి మధ్యాహ్నం 01:40 గంటలకు రాజంపేట గ్రామానికి సంబంధించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల తహసీల్దార్ జానకి, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బెయిల్ పై రిలీజ్ గిరెడ్డి మహేందర్ రెడ్డి

**రామారెడ్డి మార్చ్ 03 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి జిల్లా కేంద్రంలో గత కొన్ని రోజుల క్రితం వాడివేడిగా బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి వర్సెస్ షబ్బీర్ అలీ ఇరు వర్గాల మధ్య జరిగిన వర్గ పోరు లో అవాంఛనీయ సంఘటనలు జరిగిన సందర్భంగా అక్కడికక్కడే కారు బోల్తా వేసిన ఘటన జరిగిన పిదప పోలీసులు తక్షణమే స్పందించి శాంతి భద్రతల దృశ్య రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామ మాజీ సర్పంచ్, కామారెడ్డి డిసిసి వైస్ ప్రెసిడెంట్ గిరెడ్డి మహేందర్ రెడ్డి మంగళ వారం బెయిల్ పై రిలీజ్ అవ్వడం జరిగిందని కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# భార్యపై కత్తితో హత్యాయత్నం

- భర్తకు 2 సంవత్సరాల జైలు శిక్ష.
- అప్పీల్‌కు వెళ్లినా తప్పని శిక్ష: బాధితురాలికి దక్కిన న్యాయం!.
- జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర

కామారెడ్డి ప్రతినిధి మార్చి 03. (ప్రజాజ్యోతి)

కొండంత అండగా ఉంటాడనుకున్న భర్తే.. కసాయిలా మారి కత్తి పట్టాడు. మద్యం మత్తులో కన్నబిడ్డలను, కట్టుకున్న భార్యను వేధిస్తూ, చివరకు ప్రాణాలు తీసేందుకు తెగబడ్డాడు. కానీ, న్యాయం ముందు నిందితుడి ఆటలు సాగలేదు. లింగంపేట్ పోలీసుల పక్కా దర్యాప్తు, బాధితురాలి పోరాటంతో.. ఆ కిరాతకుడికి జైలు శిక్షే గతి అయ్యింది. ఎన్ని అప్పీళ్లకు వెళ్లినా న్యాయదేవత తగిన శాస్తి చేసింది. నేడు ఆ నిందితుడు ఊచలు లెక్కపెడుతున్నాడు

పోతాయిపల్లి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారురాలు గ్యారబోయిన మైసవ్వ, భర్త సంగయ్య. 25 సంవత్సరాల క్రితం సంగయ్యతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కొడుకులు కలరు. వివాహం జరిగిన తరువాత 10 సంవత్సరాల పాటు సుఖశాంతులతో జీవించారు. అనంతరం భర్త మద్యానికి బాగా అలవాటు పడి, ఆమెను మరియు పిల్లలను వేధించడం ప్రారంభించాడు. అదే సమయంలో భర్త సంగయ్య మరొక స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకొని ఆమెతో వెళ్లిపోయాడు. అప్పటి నుండి మైసవ్వ తన పిల్లలతో కలిసి పోతాయిపల్లిలోనే ఉంటూ జీవిస్తోంది.

మరల సుమారు 9 సంవత్సరాల క్రితం భర్త ఇంటికి వచ్చి ఇకనుండి బాగానే ఉంటానని చెప్పి వారితో కలిసి నివసించాడు. కొంతకాలం బాగానే ఉన్నప్పటికీ, తిరిగి మద్యానికి అలవాటు పడి తాగడానికి డబ్బులు ఇవ్వమంటూ ఆమెను మరియు ఆమె కొడుకులను కొట్టుచూ వేధించాడు.

ఒక రోజు అర్ధరాత్రి ఇంటికి వచ్చి, ఆమెను మరియు ఆమె ఇద్దరు కొడుకులను ఇంటి నుండి వెళ్లగొట్టాడు. దాంతో ఆమె తన ఇద్దరు కొడుకులను తీసుకుని తన ఆడపడుచు నీల సంఘవ గారి వద్ద ఉంటూ పని చేసుకుంటూ జీవిస్తోంది. తేదీ 17-11-2023 నాడు ఉదయం సుమారు 6:30 గంటల సమయంలో బిందెలో మంచినీళ్లు ఎత్తుకుని వస్తుండగా, తన ఆడపడుచు ఇంటి వాకిట్లోకి రాగానే భర్త సంగయ్య కమ్మ కత్తి తీసుకుని అక్కడికి వచ్చాడు. ఆమెను చంపాలనే ఉద్దేశంతో మెడపై నరకడానికి ప్రయత్నించగా, ఆమె పక్కకు తిరిగింది. దాంతో కత్తి బిందెకు తగిలింది. వెంటనే తన కొడుకు అక్కడికి చేరుకుని కత్తిని గుంజుకున్నాడు.



కావున భర్త సంగయ్య తనను చంపాలనే ఉద్దేశంతో కమ్మ కత్తి తీసుకుని నరకడానికి ప్రయత్నించిన విషయమై లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా, కేసు నమోదు చేసి నిష్ణాతంగా దర్యాప్తు నిర్వహించి నిందితుడిని కోర్టుకు హాజరు పరిచారు.

ఈ కేసులో 24.07.2024 న అసిస్టెంట్ సెషన్స్ కోర్టు - కామారెడ్డి న్యాయమూర్తి నాగారాణి నిందితునికి 5 సంవత్సరాల జైలు శిక్ష మరియు 2 వేల రూపాయల జరిమానా విధించారు. అనంతరం నిందితుడు జిల్లా కోర్టులో అప్పీల్‌కు వెళ్లగా, మంగళవారం జిల్లా న్యాయమూర్తి డా. సిహెచ్. విఆర్‌ఆర్ వరప్రసాద్ విచారణ అనంతరం నిందితుడికి 2 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

సరియైన పద్ధతిలో కేసు విచారణ చేసి పకడ్బందీ ఆధారాలతో నిందితునిపై కోర్టు యందు అభియోగ పత్రం వేయడం జరిగింది. కావున ఇట్టి కేసులో అసిస్టెంట్ సెషన్స్ కోర్టు, కామారెడ్డి ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌కు వెళ్లినప్పటికీ, శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి తమ తీర్పు వెల్లడించారు.

ఈ కేసులో బాధితురాలికి న్యాయం జరగడానికి కృషి చేసిన పోలీస్ తరపున వాదన వినిపించిన పీపీ రాజగోపాలగౌడ్, ఈ కేసును సరియైన పద్ధతిలో విచారణ చేసిన అప్పటి లింగంపేట్ ఎస్సై ప్రభాకర్, యెల్లారెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ప్రస్తుత ఎస్సై దీపక్ కుమార్, ప్రస్తుత యెల్లారెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్సై రామేశ్వర్ రెడ్డి, సీడీఓ సాయిలు లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## హోలీ సంబరాలు ఘనంగా..
## తాండాల్లో సంప్రదాయ వేడుకలు





గాంధారి, మార్చి 03 (ప్రజాజ్యోతి)

గాంధారి మండలం కేంద్రంతో పాటు పరిసర గ్రామాలు, తాండాల్లో మంగళవారం హోలీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే రంగుల పండుగ సందడి ప్రారంభమై, చిన్నారుల నుండి పెద్దల వరకు అందరూ రంగుల్లో మునిగిపోయారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.గ్రామాల్లో చిన్నారులు బోర్లు, కులాయిలు, చిన్న నీటి పంపుల వద్ద నీటితో ఆడుకుంటూ కేరింతలు కొట్టారు. యువత డీజే పాటలతో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ పండుగను ఆనందంగా గడిపారు.తాండాల్లో లబానా సమాజానికి చెందిన ప్రజలు తమ సాంప్రదాయ పద్ధతిలో హోలీని ప్రత్యేకంగా జరుపుకున్నారు. తాండా నాయక్ ఇంటి వద్ద మహిళలు, యువకులు, పెద్దలు కలిసి డీజే సౌండ్‌లకు అనుగుణంగా నృత్యాలు చేశారు. సంప్రదాయ 'లబానా ఖేల్ ఖుద్' కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, పురుషులు కట్టెలతో సాంప్రదాయ రీతిలో ఆడుతూ హోలీ వేడుకలను నిర్వహించారు.బంజారా నాయకులు, యువకులు, మహిళలు తమ జానపద పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ పరస్పరం సఖ్యతను పంచుకుంటూ హర్షాతిరేక వాతావరణంలో హోలీ సంబరాలు ముగిశాయి.

# రంగుల హోలీ సందడి

రాజంపేట మార్చి 03 (ప్రజా జ్యోతి)

రాజంపేట మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం నుంచే గ్రామాలు రంగుల మేళవింపుతో పండుగ వాతావరణంలో మునిగిపోయాయి. చిన్నారుల కేరింతలు, యువత ఉత్సాహ నృత్యాలు, మహిళల ఆనందోత్సాహాలతో హోలీ సంబరాలు కళకళలాడాయి. ప్రధాన కూడళ్ల వద్ద యువకులు రంగుల నీటితో ఆటపాటల్లో పాల్గొనగా, చిన్నారులు పిచ్కారీలతో హోలీని ఆస్వాదించారు. ఇంటింటా స్వీట్లు పంచుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు కొనసాగడం విశేషం. ఈ సందర్భంగా రాజంపేట ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఇట్టం సిద్ధిరాములు మాట్లాడుతూ, హోలీ పండుగ సమాజంలో సఖ్యత, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. రంగుల పండుగ మనసుల మధ్య ఉన్న దూరాలను తొలగించి ఆనందాన్ని



పంచుతుందని తెలిపారు. ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. హోలీ పండుగ ప్రత్యేకతల గురించి మాట్లాడుతూ, చెడు పై మంచి విజయం సాధించిన సంకేతంగా ఈ పండుగను జరుపుకుంటారని, కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలసి ఆనందాన్ని పంచుకోవడం హోలీ అసలు సారాంశమని అలుగురికి వివరించినట్టు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోనూ ప్రజలు ఐక్యంగా హోలీ సంబరాలు జరుపుకోవడం విశేషంగా నిలిచింది.

## రంగుల హోలీతో గాంధారిలో సందడి





గాంధారి, మార్చి 03 (ప్రజాజ్యోతి )

గాంధారి మండలం కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో మంగళవారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం వేళ నుంచే రంగుల పండుగ సందడి నెలకొని గ్రామాలు పండుగ వాతావరణంలో మునిగిపోయాయి. చిన్నారుల కేరింతలు, యువత ఉత్సాహ నృత్యాలు, మహిళల ఆనందోత్సాహాలతో హోలీ సంబరాలు కళకళలాడాయి.మహిళలు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంటింటా స్వీట్లు పంచుకుంటూ స్నేహభావాన్ని చాటుకున్నారు. కొంతమంది యువత డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ హోలీని మరింత ఉత్సాహంగా మార్చారు.గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద యువకులు రంగుల నీటితో ఆటపాటల్లో పాల్గొనగా, చిన్నారులు బకెట్లు, పిచ్కారీలతో హోలీని ఆస్వాదించారు. వృద్ధులు కూడా యువతతో కలిసిపడి వేడుకల్లో పాల్గొనడం ఆకట్టుకుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో హోలీ వేడుకలు కొనసాగాయి.సమాజంలో సఖ్యత, ఐక్యతను పెంపొందించే పండుగగా హోలీని ప్రజలు ఆనందంగా జరుపుకున్నరు.



## ఆపరేషన్ నిమిత్తమై బి నెగెటివ్ రక్తం అందజేత

- రక్తదానంతో ఆదర్శంగా నిలుస్తున్న ఏఈఓ అశోక్ రెడ్డి
- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు

కామారెడ్డి ప్రతినిధి మార్చి 03.(ప్రజాజ్యోతి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో పట్టణానికి చెందిన జువ్వాడి భాగ్యమ్మ (48) కి ఆపరేషన్ నిమిత్తమై బి నెగెటివ్ రక్తం అవసరం కావడంతో వ్యవసాయ విస్తరణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అశోక్ రెడ్డి వెంటనే స్పందించి రక్తదానం చేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ నెగిటివ్ గ్రూపులకు సంబంధించిన రక్తం దొరకడం చాలా ఇబ్బందులతో కూడుకొని ఉంటుందని ప్రతి సంవత్సరం మూడు నుండి నాలుగు సార్లు రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రక్తదాత అశోక్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. రక్తదాతలు ప్రాణదాత లే అని, సకాలంలో రక్తం దొరకకపోతే ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉంటాయని ఎన్ని డబ్బులు ఉన్నా రక్తాన్ని పొందడం సాధ్యం కాదని అన్నారు మానవత దృక్పథంతో రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని అన్నారు.



## ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం కొలతల కార్యక్రమం ప్రారంభం

**కామారెడ్డి రూరల్ మార్చి 3 ప్రజా జ్యోతి**

ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించనున్న స్కూల్ యూనిఫాంల తయారీ కార్యక్రమం భాగంగా ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాలలో డ్రెస్సుల కొలతలు తీసుకునే కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సంఘాలకు స్టిచ్చింగ్ బాధ్యతలు అప్పగించడంతో, మహిళా సంఘ సభ్యులు పాఠశాలకు విచ్చేసి ప్రతి విద్యార్థి యొక్క కొలతలను జాగ్రత్తగా నమోదు చేశారు. పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి సరైన కొలతలతో, సౌకర్యవంతమైన మరియు నాణ్యమైన యూనిఫాం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. చిన్నారుల నుంచి పై తరగతుల విద్యార్థుల వరకు అందరి కొలతలను విడివిడిగా తీసుకుంటూ, రికార్డుల్లో నమోదు చేశారు. విద్యార్థులు కూడా ఆనందంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు రంజిత, మౌనిక, జ్యోతి, రామకృష్ణ మహిళా సంఘ సభ్యులకు సహకరిస్తూ విద్యార్థులను క్రమబద్ధంగా నిలబెట్టి కొలతలు తీసుకునే విధానాన్ని పర్యవేక్షించారు. మహిళా సంఘ సభ్యులు వాణి, సౌజన్య తదితరులు ఎంతో శ్రద్ధగా ప్రతి విద్యార్థి కొలతలను తీసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించారు. ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా యూనిఫాంల తయారీ చేపట్టడం వల్ల గ్రామ మహిళలకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. ఇది మహిళా సాధికారతకు దోహదపడటమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఒకవైపు విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు అందించడంతో వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం



తగ్గుతుండగా, మరోవైపు మహిళా సంఘాలకు ఆదాయ వనరు లభించడం అభినందనీయం అని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే యూనిఫాంలు సిద్ధం చేసి విద్యార్థులకు పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పాఠశాల వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు సహకారం అందించాలని పాఠశాల సిబ్బంది కోరారు. ఇస్రోజీవాడి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఈ యూనిఫాం కొలతల కార్యక్రమం గ్రామంలో చర్చనీయాంశంగా మారి, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ చర్యలకు ప్రజల మద్దతు వ్యక్తమవుతోంది.

## కుప్రియాల్ గ్రామంలో ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

**కామారెడ్డి రూరల్ మార్చి 3 ప్రజా జ్యోతి**

కుప్రియాల్ గ్రామంలో ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఘనంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని సంఘ సభ్యులు, పెద్దలు, యువకుల సమక్షంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులుగా బాలరాజును ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా దాసరి దామోదర్‌ను, కార్యదర్శిగా శ్రీరామ్ రవిని ఎన్నుకున్నారు. సభ్యులుగా శ్రీరామ్ శ్రీనివాస్, మాసుల శ్రీనివాస్, గడిల శ్రీనివాస్, శ్రీరామ్ భాను, పిట్ల రాజు తదితరులను నియమించారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సమావేశంలో పలువురు సంఘ పెద్దలు మాట్లాడుతూ, ముదిరాజ్ సంఘం గ్రామాభివృద్ధి, సామాజిక ఐక్యత, యువతలో చైతన్యం పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. సంఘం తరఫున విద్య, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. గ్రామంలో సామాజిక సమస్యలు ఎదురైనప్పుడు సంఘం ఐక్యంగా స్పందించాలని తీర్మానించారు.

నూతన అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ, సంఘ సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రతి ముదిరాజ్ కుటుంబాన్ని సంఘ కార్యకలాపాల్లో భాగస్వాములను చేస్తూ



ఐక్యతను బలోపేతం చేయడం తన ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఉపాధ్యక్షుడు దాసరి దామోదర్, కార్యదర్శి శ్రీరామ్ రవి కూడా సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు.

కార్యక్రమం చివరగా నూతన కార్యవర్గ సభ్యులకు శాలువాలు కప్పి సన్మానించారు. గ్రామ ప్రజలు ఈ ఎన్నికలను స్వాగతిస్తూ సంఘం మరింత బలంగా ఎదగాలని ఆకాంక్షించారు.

# ఘనంగా హోలీ సంబరాలు

### - అందరికీ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ ప్రవీణ్

**రామారెడ్డి మార్చ్ 03 (ప్రజాజ్యోతి)**

రామారెడ్డి మండల కేంద్రంలో మంగళవారం రోజున హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సీతారామచంద్ర రాజరాజేశ్వర ఉభయ ఆలయాలనుండి హోలీ సంబరాలను మిత్రులు అందరూ కలిసి ఒకరికి ఒకరు అలై బలై చేసుకుని రంగులు పూసుకున్నారు.

అనంతరం రామారెడ్డి గ్రామంలో నూతన పాలకవర్గం మరియు వార్డు సభ్యులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు వివిధ పార్టీల గ్రామ అధ్యక్షులు వివిధ సంఘాల యూత్ అధ్యక్షులు భారీ ఎత్తున పాల్గొని హోలీ సంబరాలను వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంవత్సరానికి ఒకసారి వచ్చిన హోలీని దూర ప్రాంతంలో ఉన్నటువంటి మిత్రులు అందరూ కలిసి వారి యొక్క మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం హోలీ సంబరాలలో పాల్గొని వ్యక్తిగత జీవితం గురించి స్నేహితులు మాట్లాడుకోవడం జరిగింది. అలాగే కుటుంబ విషయాలను గ్రామం యొక్క అభివృద్ధి విషయాలను రాబోయే రోజుల్లో గ్రామ అభివృద్ధికి యువత అందరం కలిసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని చర్చించుకున్నారు. హోలీ సంబరాలను రామాలయం మొదలుకొని గ్రామంలో వివిధ ప్రధాన కూడలిలో స్నేహితులతో కలిసి బ్యాండ్ మేళాలు మరియు డీజే బాక్సులు ఏర్పాటు చేసే ఆనందంగా హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో పెద్ద



చిన్న లేకుండా అందరూ ఆనందంతో హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు.



## కాలకృత్యాలు తీర్చుకోడానికి వెళ్లి చెరువులో పడి మహిళ మృతి..

**నాగిరెడ్డిపేట్, మార్చి3( ప్రజాజ్యోతి):**



కాలకృత్యాలు తీర్చుకోడానికి వెళ్లిన మహిళ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన మంగళవారం నాగిరెడ్డిపేట్ మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ధర్మారెడ్డి గ్రామానికి చెందిన జోడు పోచవ్వ(46) గత ఆరు నెలలుగా పక్షవాతం వ్యాధితో బాధపడుతుండేదని, సోమవారం మధ్యాహ్నం సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామంలోని ఊర చెరువు వద్ద వెళ్లగా ప్రమాదవశత్తు కాలుజారి చెరువులో పడి నీటమునిగి, ఈతరాక, ఊపిరాడక మృతి చెందినట్లు భర్త నారాయణ ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## బీబీపేటలో ఆదివారం నుండి పశువుల సంత




**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి మార్చి 3**

బీబీపేట మండల కేంద్రంలో మార్చి 8 వ తేదీ ఆదివారం నుండి పశువుల సంత ప్రారంభం కానుందని మంగళవారం రోజున గ్రామ పాలకవర్గం తీర్మానం చేసి తెలిపారు. ఇట్టి సంత గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పెద్దమ్మ గుడి వెనుక భాగంలో ఈ సంత ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంతలో గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెల కొనుగోలు, మరియు విక్రయాలు జరుగుతాయని పంచాయతీ వర్గాలు తెలియజేశాయి. బీబీపేట తో పాటు పరిసర గ్రామాల రైతులు, ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారి కోరారు.

## ఇప్ప ఉమారాణి ఎన్నిక చెల్లదంటూ కోర్టుకెక్కిన ప్రత్యర్థి

**కామారెడ్డి టౌన్ ప్రజా జ్యోతి మార్చ్ 3**



| | |
|---|---|
| First Hearing Date | 03-03-2026 |
| Next Hearing Date | 06-04-2026 |
| Case Stage | NOTICE |
| Court Number And Judge | 1-Prl. District And Sessions Judge, Kamareddy |

QR Code

Petitioner And Advocate

1) Ranga Madhavi
Advocate - V.Amruth Rao

కామారెడ్డి పట్టణ ప్రథమ పౌరురాలు ఇప్ప ఉమారాణి మున్సిపల్ కౌన్సిలర్ ఎన్నిక చెల్లదంటూ కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి రెండో స్థానంలో నిలచిన ప్రత్యర్థి రంగ మాధవి మంగళవారం కామారెడ్డి జిల్లా న్యాయస్థానంలో కేసు దాఖలు చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీ 38 వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై మూడు ఓట్లతో విజయం సాధించింది. తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. జిల్లా న్యాయస్థానంలో కేసు నంబర్ జుూజుజ. ూా 1 ాఖీ 2026 ద్వారా దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారుఈ నేపథ్యంలో ఈ కేసుని జిల్లా ప్రధాన న్యాయమూర్తి విచారణకు స్వీకరించారు.

## నేడు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**రామారెడ్డి మార్చ్ 03 (ప్రజాజ్యోతి)**

రామారెడ్డి మండల కేంద్రంలోని అన్నారం గ్రామ రైతు వేదికలో మంగళవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మి, షాది ముబారక్, చెక్కుల పంపిణీ, తదుపరి టు బిహెచ్ ఇల్లుల పంపిణి కార్యక్రమం జరుగుతుందని రామారెడ్డి మండల తాసిల్దార్ ఉమలత తెలిపారు.

# ధర్మ రావు పేటలో అంగరంగ వైభవంగా కాముని దహనం

గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన హోలీ సంబరాలు

కామారెడ్డి రూరల్ మార్చి 3 ప్రజా జ్యోతి

ధర్మ రావు పేట గ్రామంలో హోలీ పండుగ సందర్భంగా నిర్వహించిన కాముని దహనం కార్యక్రమం అత్యంత ఘనంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. గ్రామ సర్పంచ్ ఉమర్, ఉప సర్పంచ్ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు గ్రామ పాలకవర్గ సభ్యులు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, చిన్నారులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సాయంత్రం వేళ గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రదేశంలో సంప్రదాయ పద్ధతుల ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజారులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక ప్రార్థనలు చేయగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం చెడు పై మంచి విజయం సాధించిన సంకేతంగా కాముని దహనం చేశారు. అగ్నిజ్వాలలు ఎగిసిపడుతుండగా గ్రామ ప్రజలు హర్షధ్వానాలు చేస్తూ ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉమర్ మాట్లాడుతూ హోలీ పండుగ సోదరభావం, స్నేహసంబంధాలకు ప్రతీక అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా ఉండి గ్రామాభివృద్ధికి సహకరించాలని, సామాజిక ఐక్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రతి పండుగను శాంతి, సామరస్యాలతో జరుపుకోవడం ద్వారా గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు.

ఉప సర్పంచ్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ యువత సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. గ్రామంలో




శాంతి భద్రతల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. గ్రామ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు గ్రామ ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని, సామాజిక సంబంధాలను పటిష్టం చేస్తాయని అభిప్రాయపడ్డారు.

కార్యక్రమం సందర్భంగా మహిళలు, పిల్లలు ప్రత్యేకంగా పాల్గొని పండుగ ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. గ్రామ యువత సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

గ్రామంలో ప్రతి వీధిలో పండుగ వాతావరణం నెలకొని ప్రజలు ఆనందోత్సాహాలతో హోలీ సంబరాలను జరుపుకున్నారు.

# బీర్కూర్ మండలంలో హోలీ పండగ సంబరాలు



బీర్కూర్, ప్రజా జ్యోతి, మార్చ్ 3

బీర్కూర్ మండలంలో హోలీ పండగ సంబరాలు ఉత్సాహభరితంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడ్డాయి. ఉదయం నుంచే యువత, చిన్నారులు, పెద్దలు రంగుల పొడులు, నీటి బెలూన్లతో ఒకరిపై ఒకరు చల్లి పండగ ఆనందాన్ని పంచుకున్నారు. గ్రామాల వారీగా యువకుల సంఘాలు ప్రత్యేకంగా హోలీ వేడుకలు నిర్వహించాయి. డీజే సాంగ్స్‌కు యువత నృత్యాలు చేస్తూ పండగ వాతావరణాన్ని మరింత రంగులమయం చేశారు. మహిళలు ఇంటివద్దే ప్రత్యేక వంటకాలు తయారు చేసి బంధుమిత్రులకు పంచిపెట్టారు. ముఖ్యంగా గ్రామాల్లో పరస్పర కలహాలు మరిచి అందరూ కలిసి హోలీ ఆడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్దలు చిన్నారులకు హోలీ పండగ ప్రాముఖ్యతను వివరించారు. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో హోలికా దహనం నిర్వహించి చెడుపై మంచి విజయం సాధించిందనే సందేశాన్ని చాటిచెప్పారు.



స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

మొత్తంగా ఈ సంవత్సరం బీర్కూర్ మండలంలో హోలీ పండగ సఖ్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచింది. గ్రామాలన్నీ రంగుల హరివిల్లులా మారి ఆనంద క్షణాలను సృష్టించాయి.

# స్నేహానికి రంగులు పూసిన హోలీ వేడుకలు

రంగుల హోలీతో పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్న మిత్రులు.

పెద్ద కొడప్‌గల్, మార్చి 03: (ప్రజాజ్యోతి)

స్నేహితులందరూ ఒక్కచోట చేరి రంగుల పండుగ హోలీ సందర్భంగా పాత జ్ఞాపకాలు పునరుద్ధరించుకుంటూ ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకున్నారు. గ్రామంలోని స్నేహితులందరిని సమీకరించుకొని ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హర్షాతిరేకంగా హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాలం ఎంత గడిచినా స్నేహబంధం మారదని వారు చాటి చెప్పారు. పండుగ సందర్భంగా కలుసుకోవడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గతకాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నవ్వులు పూశాయి. కొందరు ఉద్యోగాల నిమిత్తం, మరికొందరు కుటుంబ బాధ్యతల కారణంగా దూరంగా ఉన్నప్పటికీ, హోలీ పండుగ వారిని మళ్లీ ఒక్కచోట చేర్చింది. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ, “15 ఏళ్ల తర్వాత హోలీ ఇలా కలిసి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. పాత రోజులు గుర్తుకొచ్చాయి అని తెలిపారు. రంగుల హోలీ పండుగ స్నేహం, ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. గ్రామంలో ఈ స్నేహితుల కలయిక ప్రత్యేక ఆకర్షణగా మారింది. పాత బంధాలు మరింత బలపడాలని, ఇలాంటి వేడుకలు తరచూ జరగాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఆనందంగా రంగుల హోలీ



రామారెడ్డి మార్చ్ 03 (ప్రజాజ్యోతి)

రంగురంగుల రంగోలి అంగరంగ వైభవంగా చిన్న పెద్దలు తేడా లేకుండా ఆనందోత్సాహాలతో పాటు ఆటపాటలతో రకరకాల రంగులను ఒకరికి పై ఒకరు చల్లుకున్నారు. ఈ యొక్క పండగ ప్రతీక చెడుపై మంచి ప్రభావం చూపే విధంగా హోలీ పండగ వాతావరణాన్ని ఎంజాయ్ చేయడానికి చిన్నపిల్లలు సైతం ఆటలు ఆడడం జరిగింది. రంగులు ఆరోగ్యానికి హానికరమని తెలిసి సహజ సిద్ధమైన కలర్ లు, కుంకుమ గులాల్ లాంటివి నీటిలో కలుపుకొని చల్లుకోవడం జరిగింది. నీళ్లతో ఒకరు పై ఒకరు చల్లుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ యొక్క పండగ వాతావరణం గల్లి వాసులను ఆనంద ఉత్సాహాలతో చిన్న పెద్దలు అందరూ ఆనందం వ్యక్తం చేశారు.

# ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన



మోర్తాడ్ మార్చ్ 3(ప్రజా జ్యోతి)

మోర్తాడ్ లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులు పల్లకి సేవపై వేంచేసి భక్తులకు దర్శనమిస్తారు. ఈసారి చిన్నారులు పల్లకి సేవ ముందు చేపట్టిన ప్రదర్శన ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. స్థానిక చతురస్ర పాఠశాలకు చెందిన చిన్నారులు మోక్షిత, రితిరెడ్డి, హరిజ్ఞ, మనస్వి లు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి భూదేవిలతో పాటు కృష్ణుని అలంకారాలు ధరించి స్వామివారి పల్లకి సేవ ముందు భక్తి శ్రద్ధలతో నడవడం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. తిరుమల స్వామివారి బ్రహ్మోత్సవాలలో అనేకమంది భక్తులు వివిధ వేషాధారణలో పాల్గొనడం తెలిసిందే. అదే తరహాలో ఈసారి మోర్తాడ్ లోని స్వామివారి బ్రహ్మోత్సవాలలో చిన్నారి విద్యార్థులు ప్రదర్శన ఇవ్వడంతో ప్రజలు చిన్నారులను అభినందించారు.

# సిరికొండలో గౌర పౌర్ణమి వేడుకలు

చైతన్య మహాప్రభు జయంతి సందర్భంగా భక్తుల సందడి

నిజామాబాద్ రూరల్: మార్చి 4 (ప్రజా జ్యోతి) సిరికొండ మండల కేంద్రంలో మంగళవారం గౌర పౌర్ణమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుమారు 540 సంవత్సరాల క్రితం భక్తి మార్గాన్ని ప్రపంచానికి పరిచయం చేసి, బద్ధ జీవులను ఉద్ధరించేందుకు చైతన్య మహాప్రభు అవతరించారని భక్తులు పేర్కొన్నారు. భక్తుని రూపంలో నదియా జిల్లా పరిధిలోని మాయాపూర్ ప్రాంతంలో పౌర్ణమి రోజున చంద్రుడు ఉదయించే వేళ జన్మించినందున ఈ పర్వదినాన్ని గౌర పౌర్ణమి లేదా గౌర హోలీగా నిర్వహిస్తారని గౌరవిందా దాస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహించారు. కార్యక్రమంలో సుద్ధ భక్త గంగా దాస్, పురుషోత్తం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో గౌర పౌర్ణమి వేడుకలు ఘనంగా కొనసాగాయి.

